

# పరాయి సొత్తు

- మంత్రవాది

"సర్! టెలిగ్రామ్" అంటూ కాగితం అందించి డెలివరీ స్లిప్ మీద సంతకం పెట్టమన్నట్టు నా చేతిలో పెట్టాడు మెసెంజర్. చిరాగ్గా ఓ సంతకం గీసి పారేసి టెలిగ్రాం చూశాను. "స్టార్ట్ ఇమ్మీడియట్లీ.." కింద నాన్న పేరు. నాకు టెలిగ్రామ్ ఇవ్వవలసినంత అవసరం ఏమిటో అర్థం కాలేదు.

"ఏమిటీ?...టెలిగ్రామనుకుంటా...ఇంటి దగ్గర్నుంచేనా?" టైప్ చేసిన కాగితాలు నా టేబుల్ మీద పెడుతూ అడిగింది కొలీగ్ గీత.

"అవును".

"దేని గురించి?" మళ్ళీ ప్రశ్నించింది.

"ఏమో తెలీదు. వెంటనే బయల్దేరి రమ్మన్నారు".

"అయితే వెళ్ళండి ఆలస్యం చేయకుండా" అంటూ వెళ్ళిపోయింది.

బాగా ఆలోచించుకుని మేనేజర్ రూమ్‌లోకి అడుగుపెడుతూ–

"ఎక్స్‌క్యూజ్‌మి సర్!" పర్మిషన్ కోసం చూశాను.

"ఓహ్ ప్రభాకర్! కమిన్.. వాట్‌కెన్ ఐ డూ ఫర్యూ?"

"సర్! మరి.."నసిగాను.

"వాటీజ్ ది మేటర్?"

"ఇంటి దగ్గర్నుంచి వెంటనే బయల్దేరి రమ్మని టెలిగ్రాం సర్. ఓ మూడ్రోజులు లీవ్ కావాలి" మొహమాటంగానే అడిగాను.

"హాఫియర్ అక్కౌంట్స్‌లో వున్నాం కదా!..ఏదైనా సీరియస్ మేటరా?"

"అనుకుంటాన్సార్. ఉత్తరమైతే వదిలివేసే వాడివి. టెలిగ్రాం వచ్చిందిగా...అందుకే..."

"ఒకే..బట్...మూడ్రోజులు...కచ్చితంగా మూడ్రోజులు...లీవ్ పొడిగిస్తే మాత్రం గ్రాంట్ చేయను" స్ట్రిక్ట్‌గా చెప్పాడు.

"థాంక్యూ సర్!" అంటూ బయట పడి సెక్షన్‌లోకొచ్చాను.

సుధీర్ సీరియస్‌గా పని చేసుకుంటున్నాడు.

"సుధీ?..."

"ప్రభా!...ఏంట్రా అలా వున్నావ్?"

వాడడిగిన ప్రశ్నకి సమాధానంగా టెలిగ్రాం సంగతి చెప్పాను.

"అయితే నీ పెళ్ళి గురించే అయ్యుంటుంది" అన్నాడు.

వాడి మాటలకి నాకు చాలా కోపం వచ్చింది. కానీ వాడు నాకున్న ఒకే ఒక బెస్ట్ ఫ్రెండ్. ఏమీ అనలేకపోయాను. వాడి ప్రోద్బలంతో ప్రయాణం కట్టాను. నాతో పాటు స్టేషన్ కొచ్చిన సుధీర్ గబగబా ఎంక్వయిరీ దగ్గరకెళ్ళి ఏదో అడుగుతున్నాడు. అదే సమయంలో నేను ఎక్కవలసిన ట్రైన్ తాలూకు అనౌన్స్‌మెంట్. అది విన్న సుధీర్ నా దగ్గరకొచ్చేశాడు.

క్షణాలు దొర్లుతున్నాయి. అయిదు...పది..పావు గంట గడచిపోయింది. అంతలో ప్లాట్‌ఫారం మీధికి బండొచ్చి ఆగింది.

"ఇదేరా...ఊ..ఎక్కు".

నేను త్వరగా ఎక్కేశాను. సుధీర్ సెండాఫిచ్చి వెళ్ళిపోయాడు. కొద్ది సేపట్లోనే బండి కదిలింది. నా అంతరంగంలో ఎన్నో ఆలోచనలు..ఒకదానితో మరోటి పోటీ పడుతున్నాయి. అప్పటికే నా బుర్ర వేడెక్కి పోయింది.

"సార్! కొంచెం అడ్జెస్టవుతారా?" ఓ భారీ కాయం రిక్వెస్ట్.

కాదనలేక పక్కకి జరిగాను. అలా కూర్చున్న ఆ భారీ కాయం నన్ను నెట్టేసే పరిస్థితొచ్చేసింది. నాలో ఓర్పు నశించింది. పోనీ నిలబడదామా అనుకుంటే మూడు గంటల ప్రయాణం. అలాగే పళ్ళ బిగువున కూర్చున్నాను. ఒకటి.. .రెండు...మూడు... నాలు గంటలు పట్టింది మావూరు రావడానికి. స్టేషన్‌కి అన్నయ్యొచ్చి రిసీవ్ చేసుకున్నాడు. రిక్షా మాట్లాడుకుని ఇంటికొచ్చేశాం. గుమ్మం ముందు రిక్షా ఆగిన చప్పుడు విని లోపల్నుంచి అమ్మా నాన్నా బయటికొచ్చి నన్ను చూసి ఆనందంతో లోపలికి తీసుకెళ్ళారు. లోపల అక్కను చూసి షాకయ్యాను. అనుమానం లేదు. మా అక్కయ్య కూతురు గురించే ఈ టెలిగ్రాం తతంగం.

"ఏరా తమ్ముడూ! అసలు ఉత్తరమైనా రాయడం లేదే!"

"సెలవు ఎన్ని రోజులు పెట్టావ్‌రా? నాన్న అడిగాడు.

"ఒంట్లో ఎలా వుంది? అలా చిక్కిపోయావేరా నాన్నా?" అమ్మ పరామర్శ.

ఇలా ప్రశ్నల వర్షం కురుస్తుంటే అన్నయ్య కలుగజేసుకుని–

"ముందు వాడిని స్నానం చేసి కాసేపు రెస్ట్ తీసుకోనివ్వండి. మిగిలిన విషయాలు తరువాత మాట్లాడదాం".

'హమ్మయ్య..అన్నయ్య బతికించాడు' అని మనసులోనే అనుకుంటూ బాత్‌రూం వైపు దారి తీశాను సూట్ కేసులోంచి టవల్ తీసుకుని.

అందరి భోజనాలూ అయ్యింతర్వాత రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.

'ఇంతకీ నాకు టెలిగ్రాం ఎందుకిచ్చినట్టు?" ఏమీ తెలీనట్టు పోజు పెట్టి అడిగాను.

"అది కాదురా..నీ పెళ్ళి విషయం గురించి నిన్ననే వచ్చి వెళ్ళారు పెళ్ళివాళ్ళు. రేపు మనం చూడ్డానికెళ్ళాలి" అని నాన్న చెప్పేసరికి సీను అర్ధమయింది.

"నాకీ వయసులో పెళ్ళేంటే. ముప్ఫయ్ ఆరేళ్ళు తగలడ్డాయ్..ఇంక ఈ జన్మకింతే..ఇంకెప్పుడూ నా పెళ్ళి మాట ఎత్తొద్దు" చాలా కటువుగా చెప్పాను. ఆ మాటలు వాళ్ళని బాధపెడతాయని తెలుసు. ఎవ్వరూ మాట్లాడలేకపోయారు. ఆరోజు నాకు నిద్ర సరిగ్గా పట్టలేదు. తెల్లవారిపోయింది. త్వర త్వరగా స్నానం చేసి బయల్దేరబోయాను. అక్క నన్ను నిలదీసింది.

వదినైతే "బాధను దాచుకోవడం వల్ల ప్రయోజనం లేదు. మాతో చెప్ప ప్రభా" ఆప్యాయంగా అంది. నా బాధను చెప్పక్కోక తప్పలేదు. నేను చెప్పిన విషయాలకి అక్క కళ్ళు చెమ్మగిల్లాయి. వదినైతే చాలా బాధపడిపోయింది.

"బాధపడకండి..ఇంక ఈ జన్మకింతే" అంటూ వాళ్ళని నేను ఓదార్చవలసి వచ్చింది. అందరికీ చెప్పి ఆరోజు రాత్రికే బయల్దేరాను. అన్నయ్య స్టేషనుకొచ్చి బండెక్కించి–

"మరోసారి ఆలోచించుకోరా" అంటూ వెళ్ళిపోయాడు.

కిటికీ పక్కన కూర్చుని బయటికి చూస్తున్న నాకు అంతా అయోమయంగా తోచింది. అంతలో బండి కదిలింది. ఓ గంట గడిచింది. ఏదో స్టేషన్లో ఆగింది. నేను కూర్చున్న సీటుకి ఎదురుగా ఎవ్వరూ లేకపోవడంతో కాళ్ళు జాపుకుని కూర్చున్నాను.

అంతలో ఒకాయన "ఎక్స్‌క్యూజ్‌మీ.." అనడంతో ఆలోచనల గూడు నుంచి బయటికి వచ్చాను.

ఠక్కున కాళ్ళు తీసి అప్రయత్నంగా చూశాను. ఆయనెవరో? కానీ ఆయన పక్క...ఆమె..ఆమే.. ఆమె చేతిలో చిన్న బాబు. మూడేళ్ళుంటాయేమో..

"రా ..సరళా..కూర్చో!" అంటూ తూలుతూ కూర్చున్నాడు.

"సరళా! మైగాడ్" నాకు పిచ్చెక్కినట్టయింది. ఆమె నావంక చూసి నిర్ఘాంతపోయింది. ఇద్దరం చూపులతోనే పలకరించుకున్నాం.

నాకు మాత్రం సరళని చూస్తే బాధ పొంగుకొస్తోంది. తాగిన మైకంలో అతనలాగే వెనక్కి జారగిలబడి నిద్రకుపక్రమించాడు. అలా కాసేపటికే మత్తుగా నిద్రపోయాడు.

"సరళా! ఆయన..!" వుండబట్టలేక అడికేశాను.

" మావారు. పెళ్ళై ఎనిమిదేళ్ళయింది. నాకు మేనమామే...మరి మీరు పెళ్ళి.."

"ఎలా చేసుకుంటాను? నాకున్నది ఒకే ఒక మనసు. అదెప్పుడో నీకిచ్చేశాను. నీ సమాధానం కోసం ఎదురు చూశాను. ఆలోచించుకోవాలని టైమడిగావు...."

ఆమె కళ్ళు నామాటలు పూర్తి కాకుండానే చెమ్మగిల్లాయి. ముఖం కందిపోయింది.

"ప్లీజ్! అలా అనకండి.. మీ గురించి ఎంక్వయిరీ చేస్తే మీకు ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయారని చెప్పారు. మీ అడ్రస్ కోసం ఎంతో ప్రయత్నించాను నా సమ్మతి తెలియజేయడానికి".

"మరి నేను రాసిన ఉత్తరాలూ!" అడిగాను.

"మా నాన్న గారు హార్ట్ ఎటాక్‌తో పోయారు. విధి నన్నూ, మా అమ్మనీ మా మామయ్య ఇంటికి చేర్చింది".

"సరళా!".

"అవును. మనసొకరితో. శరీరం మరొకరితో. కాలంతో రాజీపడి కన్నాను" ఆమె గొంతులో ఆవేదన గుర్తించాను.

'ఎంత విచిత్రం! ఆమె ఒకప్పుడు నా ఊపిరి. నా సొంతం. నా సర్వస్వం' అనుకున్నాను. కానీ ఈ రోజు ఆమె మరొకరి సొత్తు.

"నాకు తెలుసండీ..మీరు నన్ను మనసులో ఛీత్కరించుకుంటున్నారని. పరిస్థితులు నన్ను అలా చేశాయి. నేనూ సగటు ఆడదాన్నే. ఓ మగతోడుంటే చాలని రాజీ పడ్డాను. నన్ను క్షమించగలరా..."జాలిగా అడిగింది.

ఆ మాటలకి సరళని చూస్తే జాలేసింది. నన్ను నేనే నిందించుకున్నాను. ఒకనాటి సరళ వేరు. ఈ సరళ వేరు. ఆమె ఇప్పుడు మరొకరిపై ఆధారపడడ పరాయి స్త్రీ.

అంతలో కీచుమని శబ్దం చేసుకుంటూ బండాగింది. కిటికీ లోంచి బయటికి చూసిన సరళ "మావయ్యా! లే.. మనూరొచ్చింది" అంటూ అతణ్ణి లేపి బాబుని ఎత్తుకుంది. అతడు లగేజీ తీసుకుని లేచి నిలబడ్డాడు. అతని వెనుకే ఆమె దిగుతోంది. అలాగే చూశాను. మళ్ళీ సరళ కళ్ళలో క్షమించమనే భావం నా మనసుని కుదిపేసింది. బండి కదిలింది.